కథ

# ఉగ్రవాది తల్లి

- పాలపర్తి జ్యోతిష్మతి

నగరంలో ఉగ్రవాదుల దాడులు...

ఎందరో అమాయక ప్రజల మృతి...

రంగంలోకి దిగిన సైన్యం...

చచ్చినవారు చావగా, తప్పించుకున్నవారు తప్పించుకోగా, పట్టుబడ్డ ఒకరిద్దరు తీవ్రవాదులు....

కొందరు మిలటరీ ఆఫీసర్ల, జవాన్ల వీరమరణం...

నాలుగురోజులకు పరిస్థితి కాస్త స్తిమిత పడింది. హడావుడి సద్దుమణిగింది.

దాడులకు గురయిన ప్రాంతంలో సైనిక చర్య జరుగుతున్నంతసేపూ తీసిన వీడియో టేపు పోలీసు కమీషనరు ఆఫీసులో ఉన్నతాధికారులు నిశితంగా పరిశీలిస్తున్నారు. ఒక్కసారిగా అందరూ నిటారుగా అయ్యారు.

"ఆపు" అరిచినట్టుగా అన్నాడు కమీషనర్.

వీడియో ఆగింది

"మళ్ళీ కాస్త వెనక్కి తిప్పి వెయ్యి."

వీడియోగ్రాఫర్ టేపుని కాస్త వెనక్కి తిప్పి మళ్ళీ ప్లే చేశాడు.

ఒక వయసుమళ్ళిన స్త్రీ చాటుచాటుగా ఉండి జరిగేదంతా గమనిస్తోంది.

"ముస్లింస్త్రీలా ఉంది."

"ఉగ్రవాదులకు చెందిన వ్యక్తేమో?"

"ఉగ్రవాద కార్యకలాపాలకు స్త్రీలను ఉపయోగించుకుంటారా?"

"అందులో ఇంత పెద్ద వయసులో...."

తలా ఒకరకంగా తమతమ అభిప్రాయాలను వెలిబుచ్చుతున్నారు.

"సరే! ఆవిడ ఫొటో ఒకటి విడిగా తీసి మిగతా టేపులు వెయ్యి" చెప్పాడు కమీషనర్.

వీరోచితంగా పోరాడి, అసువులుబాసిన మేజర్‌భరత్ ఇంటి దగ్గర, అంత్యక్రియల దగ్గర తీసిన వీడియోలలో కూడా ఆవిడ అదేవిధంగా దూరం నుంచి, ఎవరూ తనని గమనించకుండా జరిగేదంతా చూస్తోంది.

అసహనంగా చేత్తో నుదుటిమీద రాసు కుంటూ అన్నాడు కమీషనర్ "ఎక్కడా ఆవిడ ఉనికిని మనవాళ్ళు పసిగట్టలేకపోయారు. ఇప్పుడెక్కడుందో? ఇంకెటువంటి వినాశనానికి ప్రణాళికలు తయార వుతున్నాయో?"

ఉన్నట్టుండి గట్టిగా అరిచాడు "ఆమె ఫొటోలు అన్ని పేపర్లవాళ్ళకీ, టీవీ ఛానల్స్‌వాళ్ళకీ పంపించండి. దేశమంతా అలర్ట్ చెయ్యండి."

చకచకా ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. 'అమ్మయ్య' అని ఊపిరి పీల్చుకోబోతున్న దేశం వణికిపోయింది. నగరాల్లోని ముఖ్య కూడళ్ళన్నీ నిర్మానుష్య మయ్యాయి. ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని టీవీలకు అతుక్కుపోయారు. ఏ క్షణాన ఎటువంటి వార్త వినాల్సొస్తుందోనని బిక్కుబిక్కుమంటున్నారు.

పోలీసు కమీషనర్ గదిలో ఫోన్ మోగింది. ఒక్క ఉదుటున రిసీవర్ అందుకున్నాడు కమీషనర్.

"సార్! ఆవిడ ఇక్కడే ఒక గుడిమెట్లమీద సొమ్మసిల్లి పడిపోయిఉంది." అవతలినుంచి చెప్పారెవరో.

"తప్పించుకుపోకుండా జాగ్రత్తగా చూస్తుండండి. ఇప్పుడే వస్తున్నాం" గుడి ఉన్న ప్రాంతం వివరాలు కనుక్కుని పదిమంది పోలీసుల్ని అక్కడికి పంపించాడు కమీషనర్. వార్త క్షణాల్లో దావానలంలా దేశమంతా వ్యాపించింది.

వెళ్ళిన పోలీసులు ఆవిణ్ణి తీసుకొచ్చి స్టేషన్లో పడుకోబెట్టారు. ఇంకా స్పృహలోకి రాలేదు. నీళ్ళు తీసుకొచ్చి మొహం మీద చల్లారు. నాలుకతో పెదాల్ని తడుముకుంటోంది. కాసినినీళ్ళు నోట్లో పోశారు. రెండు గుక్కలు మింగి కళ్ళు తెరిచింది. తను పోలీస్ స్టేషన్‌లో ఉన్నానని అర్థమైంది. నెమ్మదిగా లేచి కూర్చుంది.

"ఎవరు నువ్వు?"

"నా పేరు జుబేదా బేగం. అహ్మద్ ఆలీ తల్లిని." తొణక్కుండా సమాధానం చెప్పింది ఆవిడ.

పోలీస్ స్టేషనంతా ఒక్కసారిగా ఉలిక్కి పడింది.

'అహ్మద్ ఆలీ!' అంటే ఈ నాలుగురోజుల దమనకాండకి సూత్రధారి. అతని తల్లి! ఎంత ధైర్యంగా చెప్తోంది?

లాఠీలన్నీ ఒక్కసారి పైకి లేచాయి.

ఆగమన్నట్లు చెయ్యెత్తాడు కమీషనర్.

అప్పటికే మీడియా అక్కడికి చేరిపోయింది. జరుగుతున్నదంతా మరుక్షణం ప్రజలకు తెలిసి పోతోంది.

"ఏం చూద్దానికొచ్చావు? గుడి దగ్గర ఏం చేస్తున్నావు?"

"నా కొడుకు చేసినపనికి ప్రాయశ్చిత్తం చేసుకోవడానికి వచ్చాను. చనిపోయిన వారి ఆత్మశాంతి కోసం ప్రార్థించడానికి గుడికి వెళ్ళాను."

"నువ్విట్లా చెప్పగానే నమ్మేసి నిన్ను వదిలేస్తామనుకున్నావా?" గర్జించాడు కమీషనర్.

"నేను చెప్పేది నిజమే. కానీ మీరు నమ్మరని, నన్ను వదలరని నాకు తెలుసు. నాకీశిక్ష పడాల్సిందే. కొట్టండి, కొట్టండి." చేతులతో తల బాదుకుంటూ ఏడుస్తోంది.

కమీషనర్ చుట్టూ చూశాడు. కానిస్టేబుల్స్‌కి సైగచేశాడు. వాళ్ళు మీడియా జనాల్ని బయటకు నెట్టేసి తలుపులేసేశారు.

"ఇప్పుడు చెప్పు. ఇంకా ఎక్కడెక్కడ దాడులు చెయ్యడానికి వ్యూహాలు పన్నారు? మీ వాళ్ళంతా ఎక్కడున్నారు?"

జుబేదా సమాధానం చెప్పకుండా తల వంచుకుని కూర్చుంది. అంతే! ఆమె శరీరం మీద లాఠాలు నాట్యమాడ్డం మొదలు పెట్టాయి. అన్ని దెబ్బలూ కిక్కురుమనకుండా భరించింది. చివరకు స్పృహ తప్పింది.

"ఆ సెల్‌లో పడెయ్యండి. స్పృహ వచ్చాక మళ్ళీ ఇంటరాగేషన్ మొదలు పెడదాం" చెప్పి తన గదిలో కెళ్ళిపోయాడు కమీషనర్.

తలుపులు తీసేటప్పటికి ఎదురుగా నిలుచుని ఉంది వందన.

"నమస్తే మేడం! మీరు .... ఇక్కడికి వచ్చారేంటి? కబురు చేస్తే మేమే వచ్చేవాళ్ళం కదా?"

తడబడుతూ అన్నాడు తలుపులు తీసిన కానిస్టేబుల్.

"జుబేదా బేగంని కలవాలి" లోపలికెళ్తూ సూటిగా వచ్చిన పని చెప్పింది వందన.

"లోపలికి రండి, కూర్చుని మాట్లాడుదురుగాని" కమీషనర్ గదిలోకి దారిచూపిస్తూ అన్నాడు కానిస్టేబుల్.

"నేను కూర్చోడానికి రాలేదు. ముందు ఆవిణ్ణి చూపించండి."

ఇంతలో ఇంకో కానిస్టేబుల్ కమీషనర్ దగ్గరికి వెళ్ళి చెప్పాడు "సార్! మేజర్ భరత్ గారి శ్రీమతి వచ్చారు. జుబేదా బేగంను కలవాలంటున్నారు."

కమీషనర్ బయటికి వచ్చాడు. వందనను చూడగానే అంతటి పోలీస్ ఆఫీసర్ కళ్ళలో లీలగా తడి మెరిసింది.

'పెళ్ళయి రెండు నెలలు కూడా కాలేదు. కాళ్ళ పారాణి ఆరకముందే పసుపుకుంకుమలను పోగొట్టుకుంది. ఆమె గుండె ఎంతగా మండిపోతోందో!' బయటకు రాబోతున్న నిట్టూర్పును దిగమింగేసి "థర్డ్‌డిగ్రీ ట్రీట్‌మెంట్ ఇస్తున్నాము.
నిజం రాబట్టకుండా వదలము. మీరేం వర్రీఅవకండమ్మా" అన్నాడు.

"నేను ఆమెతో మాట్లాడాలి" వందన ధ్యాసంతా తను వచ్చిన పని మీదే ఉంది.

మరో మార్గం లేక సెల్ తలుపు తీసి వందనని జుబేదా దగ్గరికి తీసుకువెళ్ళారు. వందన జుబేదా పక్కనే కూర్చుని కాసిని నీళ్ళు మొహం మీద చిలకరించి కాసిని నోట్లో పోసింది. కళ్ళు తెరిచిన జుబేదా ఒక్క ఉదుటున లేచి కూర్చుంది.

"నువ్వు నా కోసం వచ్చావా తల్లీ?" అంది వందనకు చేతులు జోడించి.

"హేండ్‌బాగ్‌లోంచి ఆయింట్‌మెంట్ తీసి ఆమె గాయాలకు రాస్తూ అడిగింది వందన "మీరు ఇక్కడికి ఎట్లా వచ్చారు? మా ఇంటికి ఎందుకు వచ్చారు? స్మశానం దగ్గరికి ఎందుకు వెళ్ళారు?"

కమీషనర్ అడిగిన ప్రశ్నలే! కానీ అడిగే పద్ధతిలో ఎంత తేడా! వందన చేతులు జుబేదా శరీరానికి మందు పూస్తుంటే వందన మాటలు ఆమె మనసుకు లేపనాన్ని అద్దినట్టున్నాయి. ఒక్కసారి వందన ఒళ్ళో మొహం దాచుకుని భోరుమంది.

"ఏమిటమ్మా మీరు చేస్తున్న పని? ఈ నంగనాచి మాటలు మీరు నమ్ముతారా?" జుబేదా మీద లాఠీ ఎత్తాడు కమీషనర్.

"వద్దు" అడ్డుపడింది వందన. "ఆమె చెడు ఉద్దేశంతోటే వచ్చి ఉంటే తను అహ్మద్ అలీ తల్లినన్న విషయాన్నే చెప్పేదికాదు. ఆ నిజం చెప్పిన ఆవిడ అన్నీ నిజాలే చెప్తుందని నేను అనుకుంటున్నాను. ఆమెను చెప్పనివ్వండి" అని జుబేదా వైపు తిరిగి "మీరు చెప్పండి" అంది.

వందనకు మరింత దగ్గరగా జరిగి ఒదిగి కూర్చుని చెప్పడం మొదలు పెట్టింది జుబేదా.



**చైతన్య భారతి సాహిత్య వేదిక అధ్వర్యంలో తిరుపతి ఓరియంటల్ కళాశాలలో కవి గొల్లాపిన్ని సుబ్రహ్మణ్య శర్మ రచించిన "కవితా సుమాలు" ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో, కవి గొల్లాపిన్ని, సప్తగిరి తి.తి.దే.ప్రధాన సంపాదకుడు శ్రీ శైలకుమార్, భక్తి ఛానల్ కన్సల్టెంట్ డా॥ఆర్.ఏ.పద్మనాభరావు సంఘ అధ్యక్షులు విద్వాన్ శ్రీరాముని సుందరం, ఆకాశ వాణి తిరుపతి మల్లేశ్వరరావు, సంస్థ కార్యదర్శి తోట వేంకటేశ్వర్లు. (1-2-2009)**

"మా అమ్మానాన్నా ఇక్కడే ఉండేవాళ్ళు. నేను పుట్టి పెరిగింది ఈ నగరంలోనే. పెళ్ళి అయ్యాక భర్తతో పాకిస్థాన్ వెళ్ళిపోయాను. మళ్ళీ ఇప్పటిదాకా ఇక్కడికి రాలేదు. నా అన్నదమ్ములు ఇక్కడే ఉన్నారు. రాకపోకలు లేకపోయినా అప్పుడప్పుడూ క్షేమసమాచారాలు తెలుస్తుండేవి.

నా భర్త చనిపోయాక ఇంటి బాధ్యతంతా నా కొడుకు మీద పడింది. దూరప్రాంతంలో ఉద్యోగమొచ్చిందన్నాడు. నెలకొకసారి వచ్చి డబ్బు ఇచ్చి వెళ్ళేవాడు. ముగ్గురు చెల్లెళ్ళ పెళ్ళిళ్ళూ వాడి చేతులమీదుగానే జరిగాయి. తను మాత్రం పెళ్లి ప్రస్తావన తేనిచ్చేవాడు కాదు. ఆడపిల్లలు అత్తవారిళ్ళకు వెళ్ళిపోయాక 'నేనొక్కదాన్నే ఇక్కడ ఎందుకు? నన్నుకూడా నీతో తీసుకెళ్ళు. నీ దగ్గరే ఉంటాను' అంటే ఒప్పుకోలేదు. 'అక్కడ నీను సౌకర్యంగా ఉండదు. నెలకోసారి వచ్చి వెళతున్నాను కదా! ఇక్కడే ఉంటే చెల్లెళ్ళు వచ్చివెళ్ళడానికి బాగుంటుంది' అన్నాడు. వాడు చేసే ఉద్యోగమేమిటో నేను అడగలేదు. ఆ వివరాలు తెలుసుకుని, అర్థం చేసుకునే తెలివితేటలూ, చదువూ నాకు లేవు.

పది రోజుల క్రితం నా అన్న కూతురి పెళ్ళి అని సమాచారం రావడంతో నా అల్లుళ్ళు నన్ను ఇక్కడికి పంపించారు. అప్పటికి నా కొడుకు ఇంటికి వచ్చి నాలుగు నెలలైంది. ఎక్కడికి వెళ్ళాడో, ఏమైపోయాడో తెలీదు.

రెండురోజుల క్రితం పేపర్లో 'ఉగ్రవాది హతం' అన్న వార్త కింద నా కొడుకు ఫొటో చూసి తట్టుకోలేక పోయాను. వాడు నా కొడుకేనని నా అన్నదమ్ములతో కూడా చెప్పకుండా ఇంట్లోంచి బయటకు వచ్చేశాను. వాడు నా బిడ్డ కాదని మనుసు రాయి చేసుకున్నాను. వాడిచేతుల్లో చనిపోయిన మేజర్ భరతే నా బిడ్డ అయినట్టుగా బాధపడ్డాను. అతని దేహాన్ని చూడడానికే అన్నిచోట్లకీ వెళ్ళాను. అహ్మద్ అలి చావుకు నేను బాధపడలేదు. ఉగ్రవాదుల దాడిలో మరిణించినవారికోసం, వారి కుటుంబాలకోసం ఏడ్చాను." ఇంక చెప్పాల్సింది ఏమీ లేదన్నట్టు మౌనంగా ఉండిపోయింది జుబేదా.


"ఎంత గొప్ప కథ అల్లావే ముసలిదానా! ముందు నీ అన్నదమ్ముల వివరాలు చెప్పు. వాళ్ళనికూడా తీసుకొచ్చి బొక్కలో వేసి కుళ్ళబొడిస్తే అన్ని నిజాలూ బయటికి వస్తాయి" గర్జించాడు కమీషనర్.

"ఏ తల్లీ తన కొడుకు చెడ్డవాడు కావాలని కోరుకోదు. ఆమె కొడుకు ఉగ్రవాది అయినంత మాత్రాన ఆవిణ్ణి కూడా నేరస్తురాలిగా ఎట్లా భావిస్తారు? మీరు ఆవిణ్ణి బంధించి హింసించడం

సరి కాదు. ఆవిణ్ణి నేను నాతో తీసుకెళ్తాను" అంది వందన.

"ఆమె మా విచారణలో ఉంది. మీతో ఎట్లా పంపుతాం?"

"ఏ ఆధారాలతో మీరు ఆవిణ్ణి బంధించి విచారిస్తున్నారు? ఆవిడ చెప్పిన వివరాలనుబట్టే కదా? అటువంటప్పుడు తనకే పాపమూ తెలియదన్న మాటకూడా నమ్మాలి. ఆవిడ బాధ్యత నాది. మీరెప్పుడు కావాలంటే అప్పుడు హాజరు పరుస్తాను. నాతో పంపండి."




వందన తర్కానికి సమాధానం చెప్పలేక, ఆమె వ్యక్తిగత పూచీమీద, అయిష్టంగానే, జుబేదాని వందనతో పంపించాడు కమీషనర్.

వందన ఇంట్లో ఆమె సపర్యలతో జుబేదా శరీరానికయిన గాయాలు మానికా, ఆమె ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ క్షీణిస్తోంది.

ఒకరోజు వందనతో "నేను ఉగ్రవాదులకు కొన్ని విషయాలు చెప్పాలి" అంది జుబేదా.

"ఎట్లా చెప్తారు?" అడిగింది వందన.

"అదే.... పత్రికలవాళ్ళనీ, టీవీవాళ్ళనీ పిలిచి చెప్తారు కదా! అట్లా" వివరించింది జుబేదా.

మీడియాకు ఆహ్వానాలు వెళ్ళాయి. పోలీస్ కమీషనర్‌కి కూడా సమాచారం అందించింది వందన.

అందరూ వందన ఇంటి దగ్గరకి చేరారు. జుబేదా రాకకోసం ఎదురు చూస్తున్నారు.

కమీషనర్‌కు చాలా టెన్షన్‌గా ఉంది. 'ఇప్పుడు ఈ ముసల్ది ఏం చెప్తుందో? మళ్ళీ దాడులకు తెగబడమని ఉద్బోధిస్తుందా? ఏ ఉపద్రవమైనా ముంచుకొస్తే ముందు తప్పుపట్టేది తననే. 'తెలిసీ తెలియక ఆ అమ్మాయి అడిగితే మాత్రం జుబేదాను పంపించెయ్యడమేనా?' అంటే తనేం సమాధానం చెప్పగలడు?' ఆలోచిస్తూ అసహనంగా పచార్లు చేస్తున్నాడు.

వందన జుబేదాను పట్టుకుని నెమ్మదిగా నడిపించుకుంటూ తీసుకువచ్చి కూర్చోబెట్టింది. ఒక విలేఖరి ఏదో అడగబోయాడు.

జుబేదా చేతులు జోడించి చెప్పింది "నన్నేమీ అడగకండి. మీ ప్రశ్నలకు నేను సమాధానం చెప్పలేను. ఒక ఉగ్రవాది తల్లిగా ప్రపంచంలోని ఉగ్రవాదు లందరికీ నేను కొన్ని మాటలు చెప్పాలనుకుంటున్నాను. అవి వాళ్ళకు చేరవేయండి. అదే నేను కోరుకునేది."

అందరూ ఆమె ఏం చెప్తుందా అని ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కమీషనర్ గుండెల్లో రైళ్ళు పరిగెడుతున్నాయి.

వందన బుగ్గలు నిమురుతూ చెప్పడం మొదలుపెట్టింది. "తన భర్త మరణానికి కారణం నా కొడుకేనని తెలిసికూడా ఈ బిడ్డ నన్ను అక్కున చేర్చుకుంది. నాకు సేవలు చేసింది. వైద్యం చేయించింది. నన్ను ఆరోగ్య వంతురాలిగా చెయ్యాలనుకుంది. అంతటి క్షమాగుణం ఈ నేలది. అంత గొప్ప సంస్కారం ఈ దేశానిది. అటువంటి దేశాన్ని మీరు నాశనం చెయ్యాలనుకోవడం తప్పు. ఆ ఆలోచన మానుకోండి."

ఒక్కసారి దీర్ఘంగా శ్వాస తీసుకుని మళ్ళీ మొదలుపెట్టింది "నా కొడుకు ఉగ్రవాది అని తెలిశాక నా మీద నాకే అసహ్యం వేసింది.

కొడుకు చెడు మార్గంలో వెళుతుంటే గమనించలేక పోయినందుకు -


వేలకువేలు డబ్బు తెచ్చిస్తుంటే ఎక్కడిదని అడగనందుకు -

ఇంతమందిని పొట్టన పెట్టుకున్న కొడుకును కన్నందుకు -

నాకు నేనే ఒక చెడ్డతల్లిలా కనిపిస్తున్నాను. మీరు చేస్తున్న ఘాతుకాలవల్ల మీరందరూ మీ తల్లుల్ని చెడ్డవాళ్ళని చేస్తున్నారు." ఆయాసపడుతూ కాసేపు ఆగింది.

"మీరు పవిత్రయుద్ధం చేసి మీ మతాన్నీ, దేశాన్నీ ఉద్ధరించక్కర్లేదు. దుర్మార్గాన్ని వదిలిపెట్టి, మంచివాళ్ళుగా మారి మీ కన్నతల్లులను ఈ మానసిక క్షోభనుంచి విముక్తుల్ని చెయ్యండి. మనుషుల్ని ద్వేషించకండి. హింసను ఆరాధించకండి. మానవాళిని ప్రేమించండి. మానవతను ప్రేమించండి. విశ్వ ప్రేమికులుగా మారండి."

చేతులు పైకెత్తి సమస్కారం చేసి మెల్లగా వందన ఒళ్ళో వాలిపోయి తుదిశ్వాస విడిచింది జుబేదా.



హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో సాధన సాహితీ స్రవంతి, మానస ఆర్ట్ థియేటర్స్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన సభలో శ్రీ అంబల్ల జనార్ధన్ రచించిన "బొమ్మవెనుక" కథల సంపుటిని ఆవిష్కరిస్తున్న ముఖ్య అతిథి డా॥టి.గౌరీశంకర్, చిత్రంలో నరసింహాచారి, రఘుశ్రీ, అంబల్ల జనార్ధన్, డా॥అద్దేపల్లి, శ్రీమతి అబ్బూరిఛాయాదేవి, విహారి, శ్రీమతి గోవిందరాజు సీతాదేవి ఉన్నారు.



ప్రసిద్ధకవి డా॥తిరుమల శ్రీనివాసాచార్య సప్తతిమూర్తి ముగింపు సందర్భంగా రవీంద్రభారతి హైదరాబాదులో రసమయి ఆధ్వర్యంలో జరిగిన అభినందన సభలో శ్రీనివాసాచార్య స్వరాజ్యలక్ష్మి దంపతులను సత్కరిస్తున్న అక్కినేని, మంత్రి మండలి బుద్ధప్రసాద్, చిత్రంలో శ్రీమతి విజయలక్ష్మి ఎం.ఎస్.గౌడ్, సినారె, కె.వి.రమణాచారి, ఎం.కె.రాము ఉన్నారు.